


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**70**

(4 ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"**మూడుముళ్ళూ పడేదాకానే** మోహాలూ, మోజులూ, పోజులూ - ఆ తర్వాత నిజస్వరుపాలూ బయటపడతాయి. కొంతకాలానికి నిలువుగుడ్లు కూడా!" అని ఒకాయన దాంపత్యాలను గురించి దరహంగా విమర్శించాడు.

నిజమే ఆయనగారు చెప్పింది. క్రొత్తలో వున్న పోజులూ, మోజులూ ఎన్నాళ్ళుంటాయి? పళ్ళ బిగింపుతో కొద్ది రోజులు గడిపినా తర్వాత "నేను నలకూబరుణ్ణికాదు - పట్టి నారాయణయణరావుని, కుబేరుణ్ణి కాదు - కుటుంబరావుని, మన్మధుణ్ణికాదు - సొట్టముక్కు మాధవరావును" అని చెప్పకోక తప్పదు.

జీవితమంతా హోదాగా, ఠీవిగా బ్రతకాలంటే ఎంతకష్టం? ఎంత ధనవంతుడికైనా, రూపవంతుడికైనా సాధ్యం కానిపని. పదహారు రోజుల పండుగదాకా పట్టువస్త్రాలు ధరించి, ఆరకుండా సెంట్లు పూసిన పురుషుడు. ఆ మర్నాటినుంచే పట్లుకు బదులు మధ్య కుట్లూ, అడ్డకుట్లూ వేసిన చొక్కాలు ధరించక తప్పదు.

***<u>అరచేతులలో సీసా భజన</u>***

సెంట్లు మాట మరిచిపోయి కొబ్బరినూనె కొంచెం తలకు రాసుకోవాలంటే, సీసా తిరగేసి అరచేతిలో పదిమాట్లు కొట్టి, పడ్డదాంతోనే సంతృప్తి చెందక తప్పదు.

"పంచభక్ష పరమాన్నాలతో తను నిత్యం విందులారగిస్తున్నట్టు అభినయించిన సుందరుడు. ఆ పూట కూర ఏమిటో తెలియక కొట్టుకునే స్థితిరాక తప్పదు. చూశావా! లోకంలో తమాషాలలో ఇది ఒకటి. క్రొత్తలో అలా నటించడం సర్దాకోసం ఆ నాలుగు రోజులు కొంచెం హుందాగా వుండడం కోసం అది ఒక చిన్న నాటకం" అని చెబుతూ వుంటారు పెద్దలు.

చేసేది సంసారం. ఎన్ని చిరాకులు, ఎన్ని పరాకులు వచ్చిపడతాయి? ఖర్చులు భరించలేక ఎన్నిసార్లు మూర్ఛపడుతూ వుండాలి. ఓపిక తరిగిపోతున్నకొద్దీ కాపరం అంటే ఎలాటి విసుగుపుడుతుంది?

వీటివల్ల పలకరింపుల్లో వుండే నవ్వుల గిలకరింతలు అదృశ్యమై, సంభాషణలలో వుండే బాణీలు మారిపోయి, చూపుల్లో వుండే తీపి, వాపిరి చచ్చి, వెర్రితనం బయటపడి, 'కో' అనగానే కురంగంలాగే ఎగిరి హుషారు నశించి, కూర్చున్న చోటునుంచి కదలలేని నిస్సారస్థితి ఏర్పడి అభిరుచులు తరిగి ఆశలు హెచ్చయి బాధలు మాయమై, బడాయిలు బయటపడి గాంభీర్యం స్థానంలో డాంబిక, దర్జాస్థానంలో దర్పం రూపొంది - దాంపత్య జీవనాలు బొమ్మ తిరగేసినట్లు బొరుసు బయటపడ్డట్లు అయిపోతూ వుంటాయి.

***అందమైన భార్య - అదృష్టం.***

మా బంధువుల్లో ఒకాయన మా బంధువుల్లో ఏమిటి అందరి బంధువుల్లో ఇలాటివారు వుంటారు - వున్నారు. ఆయనకు అదృష్టవశాత్తూ ఒక ఎర్రటిపిల్ల లభించింది. ఆయన రంగుకు వ్యతిరేకమైన రంగు లభించిందని ఎంతో ఉప్పొంగిపోయాడు. "అందమైన భార్యను సంపాదించావు అబ్బాయి?" అని ఎవరైనా వీపు మీద తడితే, ఆయన అదోరకం పోజు పెట్టేవాడు.

మన పిల్లవాడు ఎలాటివాడినా భార్య మాత్రం ఎర్రగా వుండాలనే భ్రాంతి ఒకటి ఏర్పడుతుంది. అతగాడికే కాకుండా అతని తల్లిదండ్రులక్కూడా అదే వ్యామోహం. నల్ల కార్బన్ పేపర్ లాంటి ఒక చెల్లయ్యతో నలభైఏళ్ళు కాపురం చేసిన ఒక ఇల్లాలు తన కూతురికి ఎర్రటివాడు, విశాలనేత్రాలవాడు, విన్నూత్నభావాలవాడు కావాలనే కోర్కె బయలుదేరింది. ఆరేళ్ళనుంచీ అన్వేషిస్తూనే వుంది.

ఎర్రటి అమ్మాయిని చేసుకున్నాడని పైన చెప్పిన యువకుడు - క్రొత్తలో ఆ అమ్మాయిని కుసుమకోమలీ, మందగమనా, చంద్రవదనా, బింబాధరీ అని ఎన్నో పేర్లతో పిలుస్తూ వుండేవాడు. ఆవిడ నడుస్తుంటే పాదాలు యెక్కడ కందిపోతాయోనని అరచేతులు పరచాలని ప్రాకులాడుతూ వుండేవాడు.

ఆవిణ్ణి అందరి ఇళ్ళకూ వెంటవేసుకు వెళ్ళి ఒక గంటసేపు సౌందర్య ప్రదర్శనలు - సారీ ఉచిత సౌందర్య ప్రదర్శనలిస్తూ వుండేవాడు.

"నీ భార్యకేమయ్యా అప్సరసలాగా వుంది. అదృష్టవంతుడవు" అన్న తర్వాతగాని అక్కడనుంచి లేచేవాడు కాదు.

ఎవరైనా తనతో మాట్లాడడానికి వస్తే వరండాలో కూర్చునివుండి ఆవిణ్ణి కాఫీతెమ్మనీ, వక్కపొడి తెమ్మనీ, దాహం కాకపోయినా మంచి నీళ్ళు తెమ్మనీ అనేకమాట్లు పిలుస్తూ వుండేవాడు. వచ్చినవాళ్ళు ఏమీ అనకపోతే చివరకు ఆయనే తెగించి "నా భార్య ఈవిడ. లభించింది చివరికి" అని నీరసంగా మాట్లాడేవాడు.

***ఆ ఎర్రమ్మాయి భర్త ఆయనే***

"ఆవిడకేమండీ చాలా బాగుంది. మంచి దాంపత్యం.. మీ అదృష్టం మంచిది" అనేదాకా అవతల వాళ్ళను వదిలేవాడు కాదు. నిజంగా ఆ రోజుల్లో ఆయన ఆనందం వెర్రితలలు వేసినట్లనిపించేది. అవునుమరి వెనుకటికి ఒక శాస్త్రం వుందిగా - ఆ ఎగిరి గంతులు వేసే వాడెవడురా అంటే - ఎర్రపిల్ల మొగుడు అని.

చాలాకాలం తర్వాత నిరుడు కాబోలు వారిని చూడడం తటస్థించింది ఒక పెళ్ళిలో. వాళ్ళను చూడగానే వెనుక ఆయన పడ్డ మోజులన్నీ జ్ఞాపకం వచ్చాయి. మళ్ళీ ఆ ప్రబంధ భాషంతా వినిపిస్తాడు కాబోలుననుకున్నా.

కానీ ఆ అధ్యాయం ముగిసిపోయింది. క్రొత్త అధ్యాయం ప్రారంభించాడు. ప్రబంధ శైలి మార్చి పైశాచిక శైలితో పడ్డాడు. ఆవిణ్ణి చూపించి "వట్టి మొద్దండీ! బుర్రలేదసలు యేం చేస్తుందో తెలియదు. ఏమి చెప్పినా అర్ధంకాదసలు. దీనికంటే మా పనిమనిషి నయం. చెప్పింది అర్ధం చేసుకుంటుంది?" అన్నాడు.

నాకు కొంచెం అనుమానం వేసింది. ఇతగాడికేమైనా మతి చెడిందా ఈ మధ్య అని. తర్వాత మెల్లగా ఆవిణ్ణి అడిగాను. ఆవిడ అన్నది పెద్దలు మీరే అర్ధం చేసుకోవాలి. నేనేది చెప్పినా తప్పేగా అని. దాన్ని బట్టి మతికేం మతి బాగానే వుంది. శ్రుతి తప్పింది అనిపించింది.

***లంబోదరుడికి - బింబాధరి:***

ఒకనాడు బింబాధరి అని వర్ణించిన ఆ లంబోదరుడిపుడు - "కుంభకర్ణుడి చెల్లెలు నిద్రలో కూర్చుని కూడా నిద్రపోతుంది సార్" అన్నాడు.

"బలహీనత ఏర్పడిందేమో" అన్నాను.

"బలహీనతకాదు. దీని బొంద. శుభ్రంగా తింటుంది. దాంట్లో టోకరాలేదు. తిని వుసూరుమంటుంది. దిక్కుమాలిన మేళం అన్నాడు.

"తిట్టకండి. విషయమేమిటో అడిగి తెలుసుకోండి. లాలించి, పాలించడం మీవంతు అన్నారు."

"ఏం లాలిస్తామండి. ఒక ప్రక్క దీనిగోలపడలేక చస్తుంటే పలకరించడానికే బాధగా వుంటే ఇంకా పాలించడమేమిటి?" వట్టి పాపిష్టిమేళం.

"తిట్లతో ఆడవాళ్ళని రొష్టుపెట్టకూడదు. వాళ్ళు అశక్తులు. ఎదురుచెప్పే హక్కులేనివాళ్ళు చిక్కుల్లో పడ్డ సంసారాల్లో కూడా కుక్కిన పేనుల్లా వుంటారు" అన్నాను.

"ఏమిటోనండి! సంసారం సంగతి ఇప్పుడు తెలిసి వస్తోంది. ఎన్నిమాట్లు చెంపలు వేసుకుని మాత్రం ఏం లాభం?" అన్నాడాయన.

"అందగత్తెలని మీరు మొదట్లో పొగిడేవారు జ్ఞాపకం వుందా?" అన్నాను.

"అందం చూచినంతమాత్రం యెన్నాళ్ళు గంతులు వేస్తాం" అన్నాడాయన.

అందం విలువకూడా అలా తగ్గిపోతుంది కొన్నాళ్ళకు. ప్రీతిలేని కంటికి యెదుటివాళ్ళు భూతాలుగా కనిపిస్తారు. అందులో భార్యాలంటే అతి చులకన. ఆత్మలో మేల్కొంటాయి కనుకనా?

●●●

Post your comments